సాక్షి మెదక్

సోమవారం । 4 । డిసెంబర్ । 2023



ప్రతీ రౌండ్‌లో ఆధిక్యత

సిద్దిపేట శాసనసభ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియలో ప్రతీ రౌండ్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థి హరీశ్ రావు ఆధిక్యత కనబరిచారు. మొత్తంగా 20 రౌండ్లలో లెక్కించారు. వివరాలు 14లో ▸



సెంటిమెంట్‌కు బ్రేక్..

2014 నుంచి 2023 వరకు సెంటిమెంట్ పేరుతో హుస్నాబాద్ నుంచి ప్రచారం ప్రారంభించిన కేసీఆర్‌కు ఈ ఎన్నికల్లో బ్రేక్ పడిందని పొన్నం ప్రభాకర్ అన్నారు. వివరాలు 14లో ▸



కాంగ్రెస్ గెలుపు సంబురాలు

మెదక్ నియోజవర్గానికి ఆదివారం వెలువడిన ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ అభ్యర్థి రోహిత్‌రావు విజయం సాధించడంతో కార్యకర్తలు సంబురాలు నిర్వహించారు. వివరాలు 15లో ▸

న్యూస్‌రీల్

హైదరాబాద్‌కు కాంగ్రెస్ అభ్యర్థి రోహిత్‌రావు



పూజలు చేస్తున్న రోహిత్‌రావు

చిన్నశంకరంపేట(మెదక్): మెదక్ కాంగ్రెస్ అభ్యర్థి మైనంపల్లి రోహిత్‌రావు గెలుపు బాటపట్టగానే సొంత గ్రామంలోని దుర్గామాత ఆలయానికి చేరుకొని పూజలు నిర్వహించారు. మెదక్‌లో కాంగ్రెస్ లీడ్‌లో ఉండడంతో పార్టీ అధిష్టానం నాయకులు రోహిత్‌కు ఫోన్‌చేసి హైదారాబాద్‌కు రావాల్సిందిగా కోరారు. దీంతో కౌంటింగ్ పూర్తి కాకముందే మెదక్ నుంచి హైదరాబాద్ బయలుదేరారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు మైనంపల్లి రంగారావు, రాజిరెడ్డి, నరేందర్, సాయిలు, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సునీతారెడ్డి నాల్గోసారి..

గతంలో మూడుసార్లు విజయం.. మూడుసార్లు ఓటమి

నర్సాపూర్ : నర్సాపూర్ ఎమ్మెల్యేగా మూడుసార్లు గెలిచి హ్యాట్రిక్ సాధించిన సునీతారెడ్డి, అనంతరం వరుసగా మూడు సార్లు ఓటమి చవిచూశారు. తిరిగి 2023 ఎన్నికల్లో బరిలో దిగి నాల్గోసారి ఘన విజయం సాధించారు. వివరాల్లోకి వెళ్తే.. వాకిటి సునీతారెడ్డి అనూహ్యంగా 1999లో రాజకీయాల్లోకి వచ్చారు. అప్పుడు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నర్సాపూర్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి సీపీఐ అభ్యర్థి, సీనియర్ నాయకుడు ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ సాధించిన చిలుముల విఠల్‌రెడ్డిని ఓడించారు. కాగా 1952లో ఏర్పడిన నర్సాపూర్ అసెంబ్లీ స్థానం నుంచి మొదటి మహిళా ఎమ్మెల్యేగా అప్పట్లో రికార్డు సృష్టించారు. కాగా 2004, 2009 సంవత్సరాల్లో జరిగిన ఎన్నికల్లో వరుసగా గెలిచి నర్సాపూర్ ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ రికార్డు సాధించారు. 2004 నుంచి 2009 వరకు పలు శాఖల్లో పని చేశారు. 2010 నుంచి 2014 వరకు రాష్ట్ర ఐకేపీ, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రిగా ఉమ్మడి రాష్ట్రంలో పని చేశారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక 2014, 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో ఓటమి చెందారు. అనంతరం సునీతారెడ్డి 2019లో బీఆర్‌ఎస్‌లో చేరి రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుత ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా బరిలో నిలిచి నాల్గోసారి ఎమ్మెల్యేగా గెలిచారు.

మూడు దశాబ్దాల తర్వాత

మెదక్ ఖిల్లాపై కాంగ్రెస్ జెండా

మెదక్: సుదీర్ఘ కాలం తర్వాత మెదక్ ఖిల్లాపై కాంగ్రెస్ జెండా ఎగిరింది. 1952 నుంచి జరిగిన మొదట ఐదుసార్లు మెదక్‌లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచారు. 1983లో కాంగ్రెస్ ఓడిపోయి తెలుగు దేశం పార్టీ గెలుపొందింది. 1989లో కాంగ్రెస్ అభ్యర్థి పట్లోళ్ల నారంరెడ్డి కాంగ్రెస్ బ్యానర్‌పై గెలుపొందారు. అనంతరం 1994,1999లో తెలుగు దేశం పార్టీకి చెందిన కరణం రామచంద్రారావు గెలుపొందగా, 2004లో రైతు నాగలి గుర్తుపై పట్లోళ శశిధర్‌రెడ్డి గెలుపొందారు. 2009లో మైనంపల్లి హన్మంతరావు టీడీపీ బ్యానర్‌పై గెలిచారు. 2014,2018లో పద్మాదేవేందర్‌రెడ్డి బీఆర్‌ఎస్ బ్యానర్‌పై గెలుపొందారు. ఇలా ఏకంగా 34 ఏళ్ల పాటు మెదక్‌లో కాంగ్రెస్ గెలుపునకు నోచుకోలేదు. 1984లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో మెదక్ నుంచి కాంగ్రెస్ బ్యానర్‌పై స్వర్గీయ ఇందిరాగాంధీ గెలిచి ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటికీ ఆ మరుసటి ఏడు శాసనసభకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ గెలవలేక పోయింది 34 ఏళ్ల అనంతరం 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి సిట్టింగ్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డిపై మైనంపల్లి రోహిత్‌రావు 10,157 ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు.

ప్రశాంతంగా కౌంటింగ్



హవేళఘణాపూర్ చౌరస్తాలో పోలీసు బందోబస్తు

హవేళిఘణాపూర్(మెదక్): మండల కేంద్రం హవేళిఘణాపూర్ వైపీఆర్ కళాశాలలో జరిగిన మెదక్, నర్సాపూర్ అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగింది. ఆదివారం ఉదయం 8 గంటలకు ప్రారంభమైన కౌంటింగ్‌కు అధికారులు అన్ని ఏర్పాట్లు చేయడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు, అధికారులు బందోబస్తు చర్యలు తీసుకున్నారు. హవేళిఘణాపూర్ చౌరస్తా నుంచి ఎలాంటి వాహనాలను అనుమతించలేదు. అధికారులు పాసులు ఇచ్చిన వారిని మాత్రమే లోనికి అనుమతించారు. ఎస్పీ ఆదేశాల మేరకు చేపట్టిన బందోబస్తుతో ప్రశాంతంగా ఎన్నికలు జరగడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.



ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న సునీతారెడ్డి

ధ్రువీకరణ పత్రాలు అందజేత

హవేళిఘణాపూర్(మెదక్): మండల కేంద్రమైన హవేళిఘణాపూర్ వైపీఆర్ కళాశాలలో ఆదివారం ఎన్నికల కౌంటింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఇందులో ఎమ్మెల్యేలుగా గెలుపొందిన వారికి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో ఆర్వోలు శ్రీనివాస్, అంబదాస్ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. జిల్లాలోని రెండు నియోజకవర్గాలకు సంబంధించి నర్సాపూర్ ఎమ్మెల్యేగా గెలుపొందిన సునీతాలక్ష్మారెడ్డికి ఆర్వో శ్రీనివాస్ ధ్రువీకరణ పత్రం అందజేశారు. మెదక్ ఎమ్మెల్యేగా గెలుపొందిన మైనంపల్లి రోహిత్ తరఫున కుటుంబీకులు రాఘవరెడ్డి మెదక్ ఆర్వో అంబదాస్ రాజేశ్వర్ చేతుల మీదుగా ధ్రువీకరణ పత్రం అందుకున్నారు. గెలుపొందిన కాంగ్రెస్ అభ్యర్థులను అధిష్టానం హైదరాబాద్‌కు పిలువడంతో రోహిత్‌రావు వెళ్లిన విషయం తెలిసిందే. కార్యక్రమంలో అరుణార్తి వెంకటరమణ తదితరులు ఉన్నారు.



రోహిత్ తరఫున ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న కుటుంబ సభ్యులు

ఫలితం చెరోటి..

- జిల్లాలో ఉత్కంఠగా సాగిన ఓట్ల లెక్కింపు
- మెదక్‌లో కాంగ్రెస్.. నర్సాపూర్‌లో బీఆర్‌ఎస్
- ఉద్యమ దివిటీ పద్మక్కకు ఊహించని షాక్
- 10,157 ఓట్ల మెజార్టీతో రోహిత్‌రావు విజయం
- 8,855 ఓట్ల మెజార్టీతో సునీతారెడ్డి గెలుపు

మెదక్: తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల ఫలితాల ఉత్కంఠ ఆదివారం వీడింది. నెల రోజులపాటు విస్తృత ప్రచారం చేసిన నాయకుల భవితవ్యం వెలువడింది. జిల్లాలో మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాలు రెండు ఉండగా, మెదక్ బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డికి ఊహించని షాక్ తగిలింది. మూడుసార్లు ఎమ్మెల్యేగా.. డిప్యూటీ స్పీకర్ గా రాజకీయ చక్రం తిప్పిన ఆమె పాతికేళ్ల రోహిత్‌రావు చేతిలో పరాజయం పాలయ్యింది. ప్రత్యర్థిని చిత్తు చేయడానికి పన్నిన 'పద్మ'వ్యూహం పటాపంచలైంది. నర్సాపూర్‌లో మాత్రం బీఆర్‌ఎస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డి తన ప్రత్యర్థి ఆవుల రాజిరెడ్డి చేతిలో విజయం సాధించింది. జిల్లాలో ఉన్న రెండు నియోజకవర్గాలను ప్రధానపార్టీలు బీఆర్‌ఎస్, కాంగ్రెస్ చెరోటి పంచుకున్నాయి.

2,026 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు..

మెదక్ నియోజకవర్గంలో మొత్తం 2,026 మంది ప్రభుత్వ ఉద్యోగులు బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి రోహిత్‌రావుకు పోస్టల్ బ్యాలెట్ దార్వా 933 ఓట్లు, ఈవీఎంల ద్వారా 85,872 ఓట్లు పడ్డాయి. బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డికి పోస్టల్ బ్యాలెట్ ద్వారా 334 ఓట్లు, ఈవీఎంల ద్వారా 76,635 ఓట్లు పడ్డాయి. బీజేపీ అభ్యర్థి విజయ్‌కుమార్‌కు పోస్టల్ బ్యాలెట్ దట్వారా 305 ఓట్లు, ఈవీఎం ద్వారా 12,648 ఓట్లు వచ్చాయి. 452 ఓట్లు నోటాతో పాటు ఇతరులకు వేశారు. మొత్తంగా 10,175 ఓట్ల మెజార్టీతో రోహిత్‌రావు విజయం సాధించారు.

సునీతకు 88,410 ఓట్లు

నర్సాపూర్ : నర్సాపూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచిన వాకిటి సునీతారెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డిపై 8,855 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. నియోజకవర్గంలో 11 మంది పోటీలో ఉన్నప్పటికీ బీఆర్‌ఎస్ కాంగ్రెస్‌ల మధ్యనే పోటీ నెలకొనగా బీజేపీ అభ్యర్థి మురళీ యాదవ్ మూడోస్థానంలో నిలిచారు. నియోజకవర్గంలో 2,23,093 మంది ఓటర్లు ఉండగా వారిలో 1,96,841 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.నియోజకవర్గ ఓట్లను 22 రౌండ్లలో లెక్కించగా సునీతారెడ్డి చాలా రౌండ్లలో ఆధిక్యత సాధించారు. ఈవీఎంల ద్వారా 88,104 ఓట్లు, పోస్టల్ బ్యాలెట్ ద్వారా 306 ఓట్లు రావడంతో ఆమెకు 88,410 ఓట్లు పోలయ్యాయి. కాంగ్రెస్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డికి ఈవీఎంల ద్వారా 78,957 ఓట్లు, పోస్టల్ బ్యాలెట్ ద్వారా 598 ఓట్లు రావడంతో 79,555 ఓట్లు వచ్చాయి. బీజేపీ అభ్యర్థి మురళీయాదవ్‌కు ఈవీఎంల ద్వారా 22,713 ఓట్లు, పోస్టల్ బ్యాలెట్ ద్వారా 152 ఓట్లు రావడంతో 22,865 ఓట్లు వచ్చాయి. మొత్తంగా 8,855 ఓట్ల మెజార్టీతో సునీతారెడ్డి విజయం సాధించారు.

పార్టీ మారి ఎమ్మెల్యేగా విజయం



వాకిటి సునీతారెడ్డి (బీఆర్‌ఎస్)
మెజారిటీ: 8,855
రెండో స్థానం: ఆవుల రాజిరెడ్డి (కాంగ్రెస్)



కాంగ్రెస్ పార్టీ నుంచి సునీతాలక్ష్మారెడ్డి మొత్తం మూడు సార్లు గెలుపొందింది. దివంగత నేత వైఎస్ఆర్ హయాంలోనే పదేళ్ల పాటు మంత్రిగా పని చేశారు. 2019లో కాంగ్రెస్‌ని వీడి బీఆర్‌ఎస్‌లో చేరారు. అప్పటి నుంచి మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా కొనసాగుతూ వచ్చారు. ఈ క్రమంలో నర్సాపూర్‌కు 2014, 2018లో రెండుసార్లు గెలుపొందిన సిట్టింగ్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డిని పక్కన పెట్టి 2023 అసెంబ్లీ ఎన్నికల్లో సునీతాలక్ష్మారెడ్డికి టికెట్ ఇచ్చారు. దీంతో ఆదివారం జరిగిన కౌంటింగ్‌లో కాంగ్రెస్ అభ్యర్థి రాజిరెడ్డిపై సునీతాలక్ష్మారెడ్డి 8,855 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.

సేవా కార్యక్రమాలతో ముందుకు..



మైనంపల్లి రోహిత్‌రావు (కాంగ్రెస్)
మెజారిటీ: 10,157
రెండో స్థానం: పద్మాదేవేందర్‌రెడ్డి (బీఆర్‌ఎస్)



మైనంపల్లి హన్మంతరావు తన కుమారుడితోపాటు, తనకూ కాంగ్రెస్‌లో టికెట్లు సాధించాడు. కుమారుడు రోహిత్‌రావును మెదక్ నుంచి బరిలో దింపగా భారీ విజయం సాధించాడు. ఈ క్రమంలో రోహిత్ రావు మెదక్‌లో చేసిన కార్యక్రమాలే ఆయన్ను గెలిపించాయని చెప్పవచ్చు. ఫిబ్రవరి మాసంలో రోహిత్ మైనంపల్లి సోషల్ సర్వీస్ ఆర్గనైజింగ్(ఎంఎస్‌ఎస్‌వో) పేరుతో మెదక్ నియోజకవర్గంలో పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. హన్మంతరావు 1997లోనే నియోజకవర్గంలో మైనంపల్లి సేవా కార్యక్రమాల పేరుతో పలు అభివృద్ధి పనులు చేశాడు. కొన్నేళ్ల క్రితం హన్మంతరావు మల్కాజ్‌గిరిగి వెళ్లాడు. సేవా కార్యక్రమాలనే ముందుకు తీసుకొచ్చిన హన్మంతరావు 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కుమారుడు రోహిత్ రావును బరిలో దింపాడు. వారు చేసిన పనులు చెబుతూ ప్రచారం నిర్వహించిన రోహిత్‌రావు పద్మాదేవేందర్‌రెడ్డిపై 10,157 ఓట్లతో విజయం సాధించాడు.

నా గెలుపు ప్రజలకు అంకితం

- సునీతాలక్ష్మారెడ్డి
- నర్సాపూర్‌లో విజయోత్సవ ర్యాలీ
- బీఆర్‌ఎస్ కార్యకర్తల సంబురాలు



మాట్లాడుతున్న సునీతా రెడ్డి

నర్సాపూర్ రూరల్: నా గెలుపు నర్సాపూర్ నియోజకవర్గ ప్రజలకు అంకితం చేస్తానని నర్సాపూర్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం నర్సాపూర్ బీఆర్‌ఎస్ శ్రేణులు భారీ స్థాయిలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఎమ్మెల్యేగా గెలుపొందిన సునీతా లక్ష్మారెడ్డి, సిట్టింగ్ ఎమ్మెల్యే మదన్ రెడ్డి ప్రజలకు అభిమానం చేస్తూ ర్యాలీగా ముందుకు సాగారు. ఇందులో భాగంగా బస్టాండ్ ఎదురుగా ప్రజలను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. నాలుగుసార్లు నర్సాపూర్ నియోజకవర్గ ప్రజలు తనను ఎమ్మెల్యేగా గెలుపొందించారని అందుకు నా జీవితాన్ని మొత్తం ప్రజలకు అంకితం ఇవ్వనట్లు తెలిపారు. సిట్టింగ్ ఎమ్మెల్యే మదన్ రెడ్డి నా గెలుపు కోసం నిరంతరం కృషి చేశారన్నారు. నియోజకవర్గ అభివృద్ధితోపాటు 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. మదన్ రెడ్డి మాట్లాడుతూ.. సునీతారెడ్డికి మంచి రాజకీయ అనుభవం ఉందని దానికి తోడు తాను చేసిన అభివృద్ధిని చూసి ప్రజలు గెలిపించారని అన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు సింగయ్య పల్లి గోపి, పంబల భిక్షపతి, అశోక్ గౌడ్, కుమ్మరి నగేశ్, సత్యంగౌడ్, నయీమ్, తదితరులు పాల్గొన్నారు. సునీతారెడ్డి గెలుపు విషయాన్ని తెలుసుకున్న నియోజకవర్గ, పలు మండలాల ప్రజలు నర్సాపూర్ చౌరస్తా వద్ద పెద్ద ఎత్తున బాణాసంచాలు కాల్చి సంబురాలు చేసుకున్నారు.

కాంగ్రెస్ నాయకుల సంబురాలు

చిన్నశంకరంపేట(మెదక్): మెదక్ కాంగ్రెస్ అభ్యర్థి మైనంపల్లి రోహిత్‌రావు గెలుపుతో మండల కేంద్రంతోపాటు ఆయన సొంత గ్రామమైన కొర్విపల్లిలో సంబురాలు జరుపుకున్నారు. పేటలో సర్పంచ్ రాజిరెడ్డి ఆధ్వర్యంలో కమాన్ చౌరస్తాలో టాపాసులు కాల్చి పెద్ద ఎత్తున సంబురాలు చేశారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు శ్రీమన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, రంగారావు, రమేశ్ గౌడ్, ఎడ్ల కిష్టయ్య, జీవన్, రాజాసింగ్, బందెల సాయిలు పాల్గొన్నారు.

మెదక్‌లో విజయోత్సవాలు

మెదక్ కలెక్టరేట్: కాంగ్రెస్ శ్రేణులు ఆదివారం మెదక్‌లో విజయోత్సవ సంబురాలు నిర్వహించారు. ఓట్ల లెక్కింపు పూర్తి కాగానే కలెక్టర్ రాజర్షిషా మెదక్ అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థి మైనంపల్లి రోహిత్‌రావు సిట్టింగ్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డిపై విజయం సాధించినట్లు ప్రకటించారు. దీంతో కాంగ్రెస్ శ్రేణులు అక్కడి నుండే సంబరాలు ప్రారంభించారు. పట్టణంలోని ధ్యాన్‌చంద్ చౌరస్తా, ఆర్టీసీ బస్సుడిపో, రాందాస్ మీదుగా పాత బస్టాండ్ చేరుకున్నారు. అక్కడ టపాసులు కాల్చి సంబురాలు చేసుకున్నారు. అనంతరం ఆటోనగర్ మీదుగా వెల్‌కం బోర్డు వరకు చేరుకుంది. తిరిగి పట్టణంలోని రాందాస్ చౌరస్తాకు చేరుకొని అక్కడ టపాసులు కాల్చి సంబురాలు చేసుకున్నారు.



మెదక్‌లో కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు



చిన్నశంకరంపేటలో సంబురాలు చేస్తున్న నాయకులు

కొమురవెల్లిలో భక్తుల కిటకిట



ఆలయ రాజగోపురం ఎదుట భక్తుల సందడి

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. మల్లన్న మమ్మేలు స్వామి అంటూ భక్తులు చేసిన నామస్మరణతో ఆలయ పరిసరాలు పులకరించాయి. భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. గంగిరేణి చెట్టు వద్ద ముడుపులు కట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఏర్పాట్లను ఆలయ ఈవో బాలాజీ, ఏఈవో అంజయ్య, ప్రధానార్చకులు పర్యవేక్షించారు.




నాచగిరిలో వ్రతమాచరిస్తున్న భక్తులు

నాచగిరికి భక్తుల తాకిడి

వర్గల్(గజ్వేల్): అసెంబ్లీ ఫలితాల రోజు సైతం నాచగిరికి భక్తులు పోటెత్తారు. కార్తీక వ్రతాలతో శోభిల్లింది. ఆదివారం సత్యదేవుని వ్రతాలు ఆచరించేందుకు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన దంపతులతో వ్రతమండపం కిటకిటలాడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు 150 సత్యనారాయణ స్వామి వ్రతాలు జరగడం విశేషం. అదేవిధంగా 11 నిజాభిషేకాలు, 8 కల్యాణాలు జరిగాయి. ఆలయ ఈఓ అన్నపూర్ణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సంగ్రామంలో నిలుపుకున్నారు

పద్మకు 810 ఓట్లు



పద్మాదేవేందర్‌రెడ్డి స్వగ్రామం కోనాపూర్

రామాయంపేట(మెదక్): ఎన్నికల్లో ఓటమి పాలైన బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి తన స్వగ్రామమైన రామాయంపేట మండలం కోనాపూర్‌లో మాత్రం పట్టు నిలుపుకున్నారు. గ్రామంలోని రెండు బూతుల్లో మొత్తం 1601 ఓట్లు పోల్‌కాగా, బీఆర్‌ఎస్‌కు 810, కాంగ్రెస్‌కు 530, బీజేపీకి 176 ఓట్లు పడ్డాయి. ఇటీవల జరిగిన పరిణామాలతోపాటు కోనాపూర్ సహకార సంఘంలో నిధుల దుర్వినియోగం ఆరోపణల విషయమై గ్రామంలో అధికార పార్టీ నష్టం వాటిల్లుతుందని అందరూ భావించారు. కానీ గ్రామంలో బీఆర్‌ఎస్‌కు 50 శాతం మేర ఓట్లు పడడంతో గ్రామ పార్టీ నాయకులు ఊపిరి పీల్చుకున్నారు.

మైనంపల్లి రోహిట్టు'



కొర్విపల్లిలో ఓటు వేసిన రోహిత్‌రావు(ఫైల్)

చిన్నశంకరంపేట(మెదక్): మెదక్ కాంగ్రెస్ అభ్యర్థి మైనంపల్లి రోహిత్‌రావుకు సొంత గ్రామమైన పేట మండలం కొర్విపల్లిలో భారీగా ఓట్లు పడ్డాయి. కొర్విపల్లి గ్రామంలో 680 ఓట్లు పోలింగ్ కాగా ఇందులో 522 ఓట్లు మైనంపల్లి రోహిత్‌కు వేసి గ్రామస్తులు తమ అభిమానం చాటుకున్నారు. ఇక్కడ పద్మాదేవేందర్‌రెడ్డికి 123 ఓట్లు రాగా, ఇతరులకు 25 ఓట్లు పడగా, నోటాకు 10 ఓట్లు వేశారు. సొంత గ్రామంలో పట్టు నిలుపుకున్న రోహిత్‌రావు గెలుపుతో ముందుగా గ్రామానికి చేరుకొని దుర్గామాత అమ్మవారికి తొలి పూజలు నిర్వహించారు. గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆవుల రాజిరెడ్డికి 1,668 ఓట్లు



మాసాయిపేట గ్రామం

వెల్దుర్తి(తూప్రాన్): నర్సాపూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన ఆవుల రాజిరెడ్డి స్వగ్రామంలో స్వల్ప మెజార్టీ లభించింది. ఓటు హక్కు వినియోగించుకున్న మాసాయిపేట గ్రామంలో ఐదు బూత్‌లు ఉండగా 3,198 ఓట్లు పోలు కాగా, ఇందులో కాంగ్రెస్ అభ్యర్థి రాజిరెడ్డికి 1,668 ఓట్లు, సునీతాలక్ష్మారెడ్డికి 1,249 ఓట్లు వచ్చాయి. ఇందులో రాజిరెడ్డికి 419 ఓట్ల మెజార్టీ వచ్చింది. ఇతరులకు 289 ఓట్లు వచ్చాయి. మాసాయిపేట మండల వ్యాప్తంగా 750 ఓట్లు, వెల్దుర్తి మండలంలో 1,530 ఓట్లు కలిపి మొత్తం మీద ఉమ్మడి వెల్దుర్తి మండలంలో 2,280 ఓట్లు ఆధిక్యం సంపాదించారు.

సునీతారెడ్డికి 1,299 ఓట్లు



సునీతారెడ్డి స్వగ్రామం గోమారం

శివ్వంపేట(నర్సాపూర్) : అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందిన బీఆర్‌ఎస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డికి స్వగ్రామం గోమారంలో 483 ఓట్ల ఆధిక్యం వచ్చింది. ఇక్కడ మూడు పోలింగ్ బూత్‌లు ఉండగా 2,497 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 2,280 ఓట్లు పోల్ కాగా బీఆర్‌ఎస్‌కు 1,299, కాంగ్రెస్‌కు 816, బీజేపీకి 82 ఓట్లు వచ్చాయి. మూడు బూతుల్లో బీఆర్‌ఎస్‌కు ఆధిక్యం వచ్చింది. మొత్తంగా బీఆర్‌ఎస్‌కు ఇక్కడ 483 ఓట్ల ఆధిక్యత లభించింది. సునీతారెడ్డి విజయం సాధించడంతో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమణగౌడ్, ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, జెడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మన్సూర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రాంరెడ్డి, తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.


చిన్నశంకరంపేటలో కాంగ్రెస్ నాయకుల సంబరాలు


గెలుపొందిన అనంతరం విజయ సంకేతం చూపుతున్న మాణిక్‌రావు


వెల్దుర్తిలో సంబరాలు చేసుకుంటున్న బీఆర్‌ఎస్ నాయకులు

విజయోత్సాహం

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఆదివారం వెలువడ్డాయి. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ హవా కొనసాగినా.. ఉమ్మడి మెదక్ జిల్లాలో మాత్రం బీఆర్‌ఎస్ పార్టీ సత్తాచాటింది. హోరాహోరీగా సాగిన ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఏడు స్థానాల్లో, కాంగ్రెస్ నాలుగు స్థానాల్లో విజయ దుందుభి మోగించింది. దీంతో ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు ఘనంగా సంబురాలు జరుపుకున్నారు.


చేగుంటలో గులాబీ శ్రేణుల ఆనందోత్సాహాలు


కోహీర్‌లో బీఆర్‌ఎస్ నాయకులు..


నారాయణఖేడ్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు..


స్వీట్లు పంచుతున్న పొన్నం ప్రభాకర్


సిద్దిపేటలో పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కిస్తున్న సిబ్బంది


ఈవీఎం బాక్స్‌లను కౌంటింగ్ కేంద్రానికి తరలిస్తూ..

ప్రతీ రౌండ్‌లో ఆధిక్యం

సిద్దిపేట నియోజకవర్గం నుంచి హరీశ్ ఘన విజయం
- రాత్రి 7వరకు కౌంటింగ్
- ఫలితాల విడుదల జాప్యం


ధ్రువీకరణ పత్రం తీసుకుంటున్న మోహన్ లాల్

సిద్దిపేటజోన్: సిద్దిపేట శాసనసభ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియలో ప్రతీ రౌండ్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థి హరీశ్‌రావు ఆధిక్యత కనబరిచారు. స్థానిక ఇందూర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం ఉదయం 8 గంటలకు మొదలైన కౌంటింగ్ ప్రక్రియ రాత్రి ఏడు గంటల వరకు కొనసాగింది. చివరి 20 రౌండ్ ఓట్ల లెక్కింపు సందర్భంగా అప్పలయా చెరువు ఈవీఎం మొరాయించింది. దీంతో తుది ఫలితాలు వెల్లడించేందుకు జాప్యం అయ్యింది. పట్టణ పరిధిలోని ఆయా బూత్‌ల వారీగా ఓట్ల లెక్కింపు సందర్భంగా బీజేపీ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు చెరో వెయ్యికి పైగా ఓట్లను సాధించారు. మొదటి రౌండ్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థి హరీశ్‌కు 6924 ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థి హరికృష్ణకు 666, బీజేపీ అభ్యర్థి శ్రీకాంత్ రెడ్డికి 615, బీఎస్పీ అభ్యర్థి చక్రధర్‌కు 509 ఓట్లు వచ్చాయి. అదేవిధంగా రెండో రౌండ్‌లో బీఆర్‌ఎస్‌కు 5637, కాంగ్రెస్‌కు 980, బీజేపీకి 1364 ఓట్లు పొందారు. మూడో రౌండ్‌లో బీఆర్‌ఎస్‌కు 6430, కాంగ్రెస్‌కు 926, బీజేపీకి 1219 ఓట్లు, నాలుగో రౌండ్ లో బీఆర్‌ఎస్‌కు 4731, కాంగ్రెస్‌కు 1062, బీజేపీకి 1087 ఓట్లు వచ్చాయి. ఐదో రౌండ్‌లో బీఆర్‌ఎస్ పార్టీకి 5734, కాంగ్రెస్ పార్టీకి 1215, బీజేపీకి 1652 ఓట్లు సాధించాయి. ఆరో రౌండ్ లో బీఆర్‌ఎస్‌కు 5718, కాంగ్రెస్‌కు 1205, బీజేపీకి 1497 ఓట్లు, ఏడో రౌండ్ లో బీఆర్‌ఎస్ పార్టీకి 4910, కాంగ్రెస్‌కు 1222, బీజేపీకి 1754 ఓట్లు, ఎనిమిదో రౌండ్‌లో బీఆర్‌ఎస్‌కు 5155, కాంగ్రెస్‌కు 1013, బీజేపీకి 1871 ఓట్లు, తొమ్మిదో రౌండ్‌లో బీఆర్‌ఎస్‌కు 3681, కాంగ్రెస్‌కు 735, బీజేపీకి 1891 ఓట్లు, పదో రౌండ్‌లో బీఆర్‌ఎస్‌కు 4565, కాంగ్రెస్‌కు 1358, బీజేపీకి 1018 ఓట్లు వచ్చాయి. పదకొండవ రౌండ్‌లో బీఆర్‌ఎస్‌కు 4713, కాంగ్రెస్‌కు 1098, బీజేపీకి 1834 ఓట్లు వచ్చాయి. 12వ రౌండ్‌లో బీఆర్‌ఎస్‌కు 3986, కాంగ్రెస్‌కు1012,బీజేపీకి 1782 ఓట్లు, 13వ రౌండ్ లో బీఆర్‌ఎస్‌కు 5252, కాంగ్రెస్‌కు 911, బీజేపీకి 1160 ఓట్లు, 14వ రౌండ్‌లో బీఆర్‌ఎస్‌కు 5784 , కాంగ్రెస్ పార్టీకి 1352, బీజేపీకి 706 ఓట్లు, 15వ రౌండ్‌లో బీఆర్‌ఎస్ పార్టీకి 5240, కాంగ్రెస్‌కు 1120, బీజేపీకి 863 ఓట్లు వచ్చాయి. 16వ రౌండ్ లో బీఆర్‌ఎస్‌కు 5193, కాంగ్రెస్‌కు 779, బీజేపీకి 658 ఓట్లు, 17వ రౌండ్ లో బీఆర్‌ఎస్‌కు 5827, కాంగ్రెస్‌కు 1189, బీజేపీకి 623 ఓట్లు, 18వ రౌండ్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థికి 5590, కాంగ్రెస్‌కు 1265, బీజేపీకి 467 ఓట్లు, 19వ రౌండ్‌లో బీఆర్‌ఎస్‌కు 5102, కాంగ్రెస్‌కు 1755, బీజేపీకి 749 ఓట్లు, 20 రౌండ్‌లో బీఆర్‌ఎస్ పార్టీకి 3937, కాంగ్రెస్‌కు 648, బీజేపీకి 268 ఓట్లు వచ్చాయి. మరోవైపు పోస్టల్ ఓట్లలో బీఆర్‌ఎస్ కు 1405, కాంగ్రెస్‌కు 717, బీజేపీకి 869, బీఎస్పీకి 296 ఓట్లు వచ్చాయి. మొత్తంగా బీఆర్‌ఎస్‌కు 105514 ఓట్లు, కాంగ్రెస్‌కు 23206, బీజేపీకి 23201, బీఎస్పీకి 16610 ఓట్లు వచ్చాయి. మరోవైపు స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసిన సాయికుమార్(రోటీ మేకర్)కు 4970 ఓట్లు రాగా, నోటాకు 1300 ఓట్లు పడ్డాయి. ఫలితాల అనంతరం సిద్దిపేట ఎమ్మెల్యేగా విజయం సాధించిన హరీశ్ పక్షాన రిటర్నింగ్ అధికారి రమేష్ బాబు చేతుల మీద బీఆర్‌ఎస్ ఎన్నికల ఏజెంట్ మోహన్ లాల్ ధ్రువీకరణ పత్రం స్వీకరించారు.

ప్రగతి భవన్ ప్రజాభవన్ కావాలి

టపాసులు కాల్చిన కామారం వాసి

చిన్నశంకరంపేట(మెదక్): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గెలుపొందడంతో సీఎం నివాసమైన ప్రగతి భవన్ ఎదుట మండలంలోని కామారం గ్రామానికి చెందిన ఆర్.సుభాష్‌రెడ్డి టపాసులు కాల్చి ప్రగతి భవన్.. ఇక ప్రజాభవన్ కావాలని ఆకాంక్షించారు. సీఎం కేసీఆర్ కబంధహస్తాల నుంచి ప్రగతి భవన్‌కు విముక్తి కలిగిందన్నారు. కాబోయే కాంగ్రెస్ ముఖ్యమంత్రి సామాన్య ప్రజలను కలిసి వారి సమస్యల పరిష్కారం కోసం ప్రగతి భవన్ ఆంక్షలు ఎత్తివేయాలని కోరారు.


ప్రగతి భవన్ ఎదుట టపాసులు కాల్చిన సుభాష్‌రెడ్డి

మూడోసారికి వరించిన విజయం

నారాయణఖేడ్: నారాయణఖేడ్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీచేసిన సంజీవరెడ్డి రెండుసార్లు వరుసగా ఓటమి పాలై మూడోసారి గెలుపొందారు. ఆయన తండ్రి దివంగత కిష్టారెడ్డి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా పనిచేశారు. 2014లో టీఆర్‌ఎస్ ప్రభంజనంలోనూ కాంగ్రెస్ తరఫున కిష్టారెడ్డి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2015లో ఆకస్మికంగా మృతిచెందారు. 2016లో జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా సంజీవరెడ్డి పోటీ చేసి ఓడిపోయారు. అనంతరం 2018లో జరిగిన ఎన్నికల్లోనూ నిలబడి మరోసారి ఓటమిని చవిచూశారు. ఈ సారి జరిగిన ఎన్నికల్లో మాత్రం ఆయన విజయం సాధించారు. సంజీవరెడ్డి 14 మే 1963లో జన్మించారు. ఆయన ఎంబీబీఎస్, డీసీహెచ్ కోర్సు పూర్తి చేశారు. ఎన్‌ఎస్‌యూఐతో పాటు జిల్లా కాంగ్రెస్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ, డీసీసీ ప్రధాన కార్యదర్శి, పీసీసీ సభ్యులు, టీపీసీసీ ఉపాధ్యక్షులు, నారాయణఖేడ్ ఎంపీపీ, జెడ్పీటీసీగా పనిచేశారు. అంతే కాకుండా సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేవారు. యువతకు ఉపాధి కల్పించేందుకు జాబ్ మేళాతోపాటు వ్యక్తిత్వ వికాస కార్యక్రమాలు ముమ్మరంగా ఏర్పాటు చేయించారు. లయన్స్‌క్లబ్ ప్రారంభ అధ్యక్షుడిగా ప్రాంతంలో వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టారు.

గజ్వేల్‌లో నోటాకే ఎక్కువ

సాక్షి, సిద్దిపేట: శాసన సభ సాధారణ ఎన్నికల్లో గజ్వేల్ నియోజకవర్గంలో 44 మంది పోటీ చేశారు. అందులో 32 మంది అభ్యర్థుల కంటే నోటాకు ఎక్కువ ఓట్లు వచ్చాయి. హుస్నాబాద్ నియోజకవర్గంలో 20 మంది అభ్యర్థులు పోటీ చేయగా 13 మంది అభ్యర్థులకు, దుబ్బాకలో 11 మంది పోటీ చేయగా 8 మందికి, సిద్దిపేటలో 21 మంది పోటీ చేయగా 16 మందికి నోటా కంటే తక్కువ ఓట్లు వచ్చాయి.

నియోజకవర్గం	నోటా
సిద్దిపేట	1260
దుబ్బాక	2,269
గజ్వేల్	832
హుస్నాబాద్	1,681

జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో 6,042 ఓట్లు నోటాకు వచ్చాయి.

ప్రజా తీర్పును గౌరవిస్తున్నాం


మాట్లాడుతున్న సతీశ్‌కుమార్

బీఆర్‌ఎస్ అభ్యర్థి సతీశ్‌కుమార్

హుస్నాబాద్: తన పై ఉన్న నమ్మకంతో ఎన్నికల్లో ఓటు వేసిన ప్రజలకు, అలాగే తన కోసం కష్టపడిన కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులకు రుణపడి ఉంటానని హుస్నాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి సతీశ్‌కుమార్ అన్నారు. ఎన్నికల కౌంటింగ్ ముగిసిన తర్వాత ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజల తీర్పును గౌరవిస్తున్నట్లు చెప్పారు. పదేళ్లలో హుస్నాబాద్ శాసన సభ్యుడిగా తనను ఎంతగానో ఆదరించారని గుర్తు చేసుకున్నారు. నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశానని తెలిపారు. ఎన్నికల్లో గెలుపు, ఓటములు సహజమేనని, కార్యకర్తలు నిరాశ చెందవద్దని సూచించారు. ఇక పై కూడా ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తామన్నారు. క్షేత్ర స్థాయిలో పార్టీ నాయకులు, కార్యకర్తలకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని సతీశ్‌కుమార్ స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రజలు మార్పును కోరుకున్నట్లు ఎన్నికల ఫలితాలు చూస్తే అర్థం అవుతుందన్నారు. హుస్నాబాద్ నుంచి పోటీ చేసి గెలిపొందిన కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్‌కు అభినందనలని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలను నేరవేర్చేందుకు , నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలన్నారు.

కొడిపల్లిలో కాంగ్రెస్ ఆధిక్యం

కౌడిపల్లి(నర్సాపూర్): బీఆర్‌ఎస్ పార్టీ సిట్టింగ్ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి స్వగ్రామం కౌడిపల్లిలో కాంగ్రెస్ పార్టీకి 416 ఓట్ల ఆధిక్యం లభించడం చర్చనీయాంశంగా మారింది. గతంలో సీపీఐ కంచుకోటగా ఉన్న కౌడిపల్లి ఆ తర్వాత బీఆర్‌ఎస్ కంచుకోటగా మారింది. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈ సారి జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఆధిక్యం లభించింది. కౌడిపల్లిలో మొత్తం 2,793 ఓట్లు ఉండగా, 2,301ఓట్లు పోలయ్యాయి. కాంగ్రెస్‌కు 1,209, బీఆర్‌ఎస్‌కు 793, బీజేపీకి 201 ఓట్లు లభించాయి. దీంతో బీఆర్‌ఎస్ కన్నా కాంగ్రెస్‌కు 416 ఓట్ల ఆధిక్యం లభించింది. గతంలో ఎప్పుడూ కాంగ్రెస్ పార్టీకి కౌడిపల్లిలో ఆధిక్యం లభించలేదు.

దుబ్బాకలో కారు జోరు

- కాంగ్రెస్ అభ్యర్థి డిపాజిట్ గల్లంతు
- అన్ని రౌండ్లలోను ఆధిక్యం

దుబ్బాకటౌన్: రాష్ట్రంలో కాంగ్రెస్ హవా కొనసాగగా.. దుబ్బాక నియోజకవర్గంలో మాత్రం కాంగ్రెస్ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డికి కనీసం డిపాజిట్ కూడ దక్కకపోవడం శోచనీయం. నియోజకవర్గంలో కారు జోరుకు బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు కనీసం పోటీ ఇవ్వలేక పోయారు. మొత్తం 19 రౌండ్లలోను బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డికే మెజార్టీ రావడం విశేషం. కాంగ్రెస్ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి 9, 10 రౌండ్లలో మాత్రమే 2వ స్థానంలో నిలువగా మిగతా 17 రౌండ్లలో 3వ స్థానంలో నిలిచారు. మిగతా 17 రౌండ్లలో బీజేపీ అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు 2వ స్థానంలో, 2 రౌండ్లలో 3వ స్థానంలో నిలిచారు. పోస్టల్ బ్యాలెట్‌లో మాత్రం బీఆర్‌ఎస్ కంటే బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు 194 ఓట్ల మెజార్టీ వచ్చింది. బీజేపీకి 622, బీఆర్‌ఎస్‌కు 428, కాంగ్రెస్‌కు 288 ఓట్లు వచ్చాయి. నియోజకవర్గంలో మొత్తం 1,73,370 ఓట్లు పోలవ్వగా కొత్త ప్రభాకర్‌రెడ్డికి 97,879, బీజేపీ అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావుకు 44,366, కాంగ్రెస్ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డికి 25,235 ఓట్లు వచ్చాయి. అయితే కనీసం డిపాజిట్ దక్కాలంటే 28,894 ఓట్లు రావాల్సి ఉండగా కాంగ్రెస్‌కు కేవలం 25,235 ఓట్లు మాత్రమే రావడంతో ఆ పార్టీ అభ్యర్థి శ్రీనివాస్‌రెడ్డి డిపాజిట్ కోల్పోయారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి ప్రభాకర్‌రెడ్డికి 56 శాతం ఓట్లు రాగా బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు 25.5 శాతం, కాంగ్రెస్ అభ్యర్థి శ్రీనివాస్‌రెడ్డికి కేవలం 14 శాతం ఓట్లు మాత్రమే వచ్చాయి.

మొత్తం 53,707 ఓట్ల మెజార్టీ రాగా పోస్టల్ బ్యాలెట్‌లో బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు బీఆర్‌ఎస్ కంటే 194 ఓట్లు అధికంగా రావడంతో బీఆర్‌ఎస్ అభ్యర్థి ప్రభాకర్‌రెడ్డి మెజార్టీ 53,513కు చేరింది.

దుబ్బాకలో రౌండ్ల వారీగా బీఆర్‌ఎస్ మెజార్టీ

రౌండ్	మెజార్టీ
1	3650
2	3140
3	3167
4	3963
5	3761
6	3110
7	1988
8	3967
9	2904
10	2691
11	3375
12	2669
13	2605
14	3220
15	2746
16	2250
17	2459
18	1912
19	122

సెంటిమెంట్‌కు బ్రేక్... డెవలప్‌మెంట్ స్టార్ట్

హుస్నాబాద్ ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్


సమావేశంలో మాట్లాడుతున్న పొన్నం ప్రభాకర్

సిద్దిపేటఅర్బన్: 2014 నుంచి 2023 వరకు సెంటిమెంట్ పేరుతో హుస్నాబాద్ నుంచి ప్రచారం ప్రారంభించిన కేసీఆర్‌కు ఈ ఎన్నికల్లో బ్రేక్ పడి, కాంగ్రెస్ గెలుపుతో హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధి ఆరంభం కానుందని హుస్నాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం ఓట్ల లెక్కింపు అనంతరం ఎన్నికల్లో గెలిచిన సందర్భంగా పొన్నాలలోని బైరి అంజయ్య గార్డెన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సెంటిమెంట్ పేరుతో పదేళ్లుగా హుస్నాబాద్ నియోజకవర్గం నిర్లక్ష్యానికి గురైందని, ఈ ఐదేళ్లలో అభివృద్ధిలో 15 ఏళ్లు ముందుకు తీసుకెళ్లి చూపిస్తామని అన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం వచ్చినా సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయని అన్నారు. నియోజకవర్గంలోని సాగునీటి ప్రాజెక్టులో నష్టపోయిన వారి సమస్యలు ముందుగా పరిష్కరిస్తామని తెలిపారు. నియోజకవర్గంలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ఏర్పాటు, టూరిజం రంగాన్ని అభివృద్ధి చేయడం, మౌలిక సదుపాయాల కల్పనకు తన ప్రాధాన్యమని తెలిపారు. ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగా మండలాల, గ్రామాల విలీనం వంటి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. నలభై ఏళ్ల క్రితం ఇందిరాగాంధీ హుస్నాబాద్‌కు వచ్చారని, ఈ ఎన్నికల సందర్భంగా ప్రియాంక గాంధీ హుస్నాబాద్‌కు మెడికల్ కాలేజీని ప్రకటించి అభివృద్ధికి బాటలు వేశారని అన్నారు. మెడికల్ కాలేజీతో ఇక్కడి ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందని అన్నారు. హుస్నాబాద్ ప్రాంతం పాడిపరిశ్రమకు పెట్టింది పేరని, ఈ ప్రాంతంలో దానిని మరింత ప్రోత్సహిస్తామని అన్నారు. పదేళ్లలో నిర్లక్ష్యం, అహంకారం, ఆర్భాటం, అట్టహాసం పేరు మీద నిరంకుశ ధోరణిలో బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని నడిపిందని, తాము అలా కాకుండా ప్రతిపక్షాలను, మీడియాను, అన్ని వర్గాలను కలుపుకొని ప్రజాపాలన అందిస్తామని అన్నారు. తనకు టికెట్ ఇచ్చిన అధిష్టానానికి, గెలుపునకు సహకరించిన సీపీఐకి, గెలిపించిన ప్రజలకు ధన్యవాదాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, కాంగ్రెస్ నాయకులు గంప మహేందర్, తాడూరి శ్రీనివాస్, దరిపల్లి చంద్రం, ముద్దం లక్ష్మి, సీపీఐ నాయకుడు కొయ్యడ సృజన్ తదితరులు ఉన్నారు.

పనిచేయని ‘బీసీ’ నినాదం

- క్యాడర్‌కు దూరమైన బీజేపీ అభ్యర్థులు
- మూడో స్థానానికే పరిమితం

మెదక్: బీసీ నినాదంతో ఓట్లు పొందుదామని బీజేపీ అభ్యర్థులు భావించినా అది పని చేయలేదు. మూడో స్థానానికే పరిమితమయ్యారు. జిల్లాలోని మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల్లో నర్సాపూర్ నుంచి ఎర్రగొల్ల మురళీయాదవ్, మెదక్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పంజా విజయ్ కుమార్ బీజేపీ టికెట్లను కైవసం చేసుకున్నారు. వారికి టికెట్లు రాగానే బీజేపీ నాయకులతో పాటు అనుబంధ సంస్థలైన బీజేవైఎం లాంటి వాటిలో పనిచేసే వారంతా బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల్లోకి వెళ్లారు. పార్టీ మారుతున్న వారిని అభ్యర్థులు ఏమాత్రం నిలువరించలేక పోయారనే ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా నర్సాపూర్ టికెట్ మురళీయాదవ్‌కు లభించగానే ఆ నియోజకవర్గంలో బీజేపీ సీనియర్ నాయకులు సింగాయిపల్లి గోపి, సునితాబాల్‌రెడ్డి, రవిగౌడ్‌తో పాటు బీజేపీ క్యాడర్ బీఆర్‌ఎస్‌లోకి వెళ్లారు. అలాగే మెదక్ టికెట్ పంజాకు దక్కడంతో ఆ పార్టీ సీనియర్ నాయకుడు నందు జనార్దన్‌రెడ్డి బీఆర్‌ఎస్‌లోకి వెళ్లగా బీజేవైఎం సీనియర్ నాయకుడు రమాకాంత్, సందీప్ సుమారు 100 యువకులతో కాంగ్రెస్‌లో చేరారు. ఇలా పార్టీమారే నాయకులను బీజేపీ అభ్యర్థులు ఏమాత్రం నిలవరించలేక పోయారు. దీంతో ఆదివారం వెలువడిన అసెంబ్లీ ఫలితాల్లో నర్సాపూర్ బీజేపీ అభ్యర్థి మురళీయాదవ్‌కు 22,713 ఓట్లు లభించగా మెదక్ అభ్యర్థి పంజావిజయ్ కుమార్‌కు 12,678 ఓట్లు మాత్రమే లభించడంతో వారు మూడో స్థానానికే పరిమితమయ్యారు. దీంతో రాజకీయాల్లో క్యాస్ట్ కార్డు ఏమాత్రం ప్రభావం చూపలేదని పలువురు అనుకుంటున్నారు.

కాంగ్రెస్ పథకాలు అమలయ్యేలా చూస్తా..

- ఐదేళ్లు విశ్రాంతి ఇచ్చారు
- అందరికీ కృతజ్ఞతలు
- ఆ పార్టీ అభ్యర్థి జగ్గారెడ్డి

సంగారెడ్డి: ‘‘సంగారెడ్డి ప్రజలు నాకు కౌన్సిలర్‌గా, మున్సిపల్ చైర్మన్‌గా అవకాశం ఇచ్చారు. అలాగే 2004, 2009లో ఎమ్మెల్యేగా అవకాశం ఇచ్చారు. 2014లో ఓడించారు. మళ్ళీ 2018లో ఎమ్మెల్యేగా గెలిపించారు. కానీ ప్రభుత్వం రాలేదు. ఇప్పుడు మళ్ళీ నన్ను ఓడించారు. ప్రజల తీర్పును గౌరవిస్తున్నాను’’ అని సంగారెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి జగ్గారెడ్డి పేర్కొన్నారు. ప్రజలు తమకు అందుబాటులో ఉండే వారిని ఎమ్మెల్యేగా గెలిపించుకున్నారన్నారు. ఆ ఎమ్మెల్యేతో పని చేయించుకోండని, తాను హైదరాబాద్‌లో ఉండి కాంగ్రెస్ పార్టీ పథకాలు అమలయ్యేలా చూస్తానని చెప్పారు. అధికారులతో ఎప్పటికప్పుడు టచ్‌లోనే ఉంటానని సంగారెడ్డి ప్రజలకు హామీ ఇచ్చారు. 24గంటలూ ఫోన్‌లో అందుబాటులో ఉండే మాజీ మంత్రి హరీశ్‌రావు, ఇప్పుడు గెలిచిన ఎమ్మెల్యేతోనూ పనులు చేయించుకోండి అంటూ వ్యంగంగా ఆవేదన వ్యక్తం చేశారు. ‘‘నేను అందుబాటులో లేను అనే కదా నన్ను విస్మరించారు అని వాపోయారు. తాను ఓడిపోయినా ఆరు గ్యారెంటీ స్కీంలు సంగారెడ్డిలో ప్రజలకు అందుతాయన్నారు. ఓటమికి పథకాలకు లింక్ ఏమీ ఉండదన్నారు. కాంగ్రెస్‌కు అధికారం ఇచ్చిన ప్రజలకు కతజ్ఞతలు తెలిపారు.


జగ్గారెడ్డి

రెండు బైక్‌లు ఢీ.. ఒకరు మృతి

వెల్దుర్తి(తూప్రాన్): ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందిన ఘటన వెల్దుర్తి మండలం కుకునూర్ గ్రామ శివారులో(ధర్మారం గేటు సమీపంలో) చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శివ్వంపేట మండలం అల్లీపూర్ గ్రామానికి చెందిన దొంతి లక్ష్మాగౌడ్(48) పాతూర్‌లో చెట్ల మందులు తీసుకొని బైక్‌పై తిరిగి వస్తుండగా.. పటాన్‌చెరుకు చెందిన చాకలి లింగం, సోని దంపతులు దామరంచకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. ఈ రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన లక్ష్మాగౌడ్ అక్కడికక్కడే మృతిచెందగా.. లింగం దంపతులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను సంగారెడ్డిలోని ఓ ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని ఏఎస్‌ఐ వసురాం సందర్శించి పంచనామా నిర్వహించారు. అనంతరం పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని నర్సాపూర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి అన్న కుమారుడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.


ప్రమాదంలో మృతిచెందిన లక్ష్మాగౌడ్